క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్‌లోని వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి రోడ్, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, అవుట్ ఏజెన్సీ, మీరా సాహెబ్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం క్రాంబే రోడ్‌లో గల భవానీ టవర్స్‌లో ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేయాలని సూచించారు. చక్కటి ఆరోగ్యానికి, క్రమశిక్షణకు యోగ దోహదం చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరి దినచర్యలో యోగ భాగం కావాలని కోరారు. ఈ సందర్భంగా గురువులు కళాధర్, నంది, మంజుల సారథ్యంలో ఉచిత శిక్షణనిస్తారన్నారు. అనంతరం షేక్ ఆసిఫ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ నాళం నాగేశ్వరరావు, 41డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, సీనియర్ నాయకులు జీఎంసీ బాషా, షేక్ రఫీ, లలితా బ్రాండ్ బాషా, కనకారావు, మల్లికార్జున రావు, భవానీ టవర్స్ పెద్దలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పిఠాపురానికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. పిఠాపురంకు చెందిన ఎస్. సత్యనారాయణ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని టీవీ నటుడు అప్పారావు అన్నారు. జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులకు, కళాకారులకు వేదిక కల్పించాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

149 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం..ఎస్ఈబీ పోలీసులు మండలంలోని తక్కెళ్లపాడు గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం 149 సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మైలవరం మండలం జీ కొండూరు గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. కొండూరుకు చెందిన తాతా రాజేష్, గోపి, బళ్లా ఫణీంద్రలను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 1.62 లక్షలు ఉంటుందని ఎస్ఈబీ సీఐ తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న ఆసిఫ్, చిత్రంలో ఎంపీ నాని, భాగ్యలక్ష్మి, ఇర్ఫాన్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):మానవాళి సుఖశాంతులతో జీవించేందుకు క్రీస్తు బోధనలు దోహదం చేస్తాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) పేర్కొన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని 45వ డివిజన్ విద్యాధరపురం పరిధిలోని ఫిలదెల్ఫియ ఏజీ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. చర్చి పాస్టర్ బ్రదర్ చార్ల్స్ పి.జాకబ్ వారిని సాదరంగా ఆహ్వానించి ఆశీస్సులు అందచేశారు. ఈ సందర్భంగా ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ తన బాల్యం నుంచి క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం జరిగిందని చెప్పారు. సేవా, దైవ గుణం క్రైస్తవ్యంలోనే అలవడిందని తెలిపారు. క్రీస్తు చూపిన శాంతి, అహింస మార్గాల్లో నడుచుకోవాలని కోరారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారి పట్ల ప్రేమ, దయ, క్షమ చూపాలని, అప్పుడే వారి జీవితం సంతోషంతో నిండుతుందన్నారు. సమాజంపట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ నాయకులు వెలగలేటి భార్గవ రాయుడు, ఎమ్ వెంగళరెడ్డి, మండల శ్రీనివాసరావు, దొడ్డ రాజశేఖర్, ఉండేల శ్రీనివాసరెడ్డి, యనమద్ది నాగ మల్లేశ్వరరావు, షేక్ అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్వమానవాళి రక్షకుడు క్రీస్తు

వించిపేట(విజయవాడపశ్చిమ): వించిపేటలోని అగాపే సంపూర్ణ సువార్త సంఘంలో జరిగిన పవిత్ర ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ స్థానిక 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావుతో కలసి ఈస్టర్ ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు గుడ్‌ఫ్రైడే రోజున సిలువలో తన ప్రాణాలను త్యాగచేసి ఆదివారం సజీవుడై లేచిన రోజున పవిత్ర ఈస్టర్ పర్వదినంగా జరుపుకుంటారని తెలిపారు. లోకంలో చెడును తొలగించి మానవాళికి మంచిని చేకూర్చటానికి క్రీస్తు తన రక్తం చిందించిన పవిత్రుడు అని కొనియాడారు. క్రీస్తు బోధించిన శాంతి, సమాధానం, ప్రేమ ఈ మార్గంలో ప్రజలందరూ నడవాలని, అప్పుడే సభ్య సమాజం అంతా ప్రశాంతంగా, ఆనందమయంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం పాస్టర్ దయాసాగర్, పాస్టర్ డేవిజ్‌రాజ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్రీస్తు పునరుత్థానం పండుగ రోజు : షేక్ ఆసిఫ్

క్రీస్తు బోధనలు నేటి సమాజానికి అవసరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఇస్లాంపేట తెలుగు బాప్టిస్ట్ సెంటినరీ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. క్రీస్తు పునరుత్థానం జరిగిన రోజు యావత్ క్రైస్తవ ప్రపంచానికి పండుగ అన్నారు. సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం చర్చి పెద్దల ఆశీస్సులు అందుకున్నారు. ఈస్టర్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఈస్టర్ పర్వదిన వేడుకలు వన్‌టౌన్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ క్రైస్తవ ప్రార్థన మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆయా మందిరాల్లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. దైవ కుమారుడు తిరిగి లోకంలో అరుదెంచిన పర్వదినంగా క్రైస్తవులు ఈ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్లు ఈస్టర్ పర్వదినం అవశ్యకతను వివరించారు. ప్రజల బాధలను నివారించేందుకు, వారి పాపాలను తొలగించేందుకే తిరిగి భూమి పైకి దైవకుమారుడు వచ్చారని తెలిపారు. సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చిలో ఈస్టర్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము ప్రత్యేక ఆరాధనలు చేశారు. చర్చి విచారణ గురువులు రెవరెండర్ ఫాదర్ విజయకుమార్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఈస్టర్ పర్వదినం రోజున అపూర్వ మహిమలను లోకానికి చాటారన్నారు. మానవాళి కోసం ఆయన శిలువ ఎక్కి ప్రాణత్యాగం చేశారన్నారు. అనంతరం మూడో రోజున తిరిగి భక్తులకు దర్శనమిచ్చారని వివరించారు. ఏసుక్రీస్తు సర్వమానవాళి కష్టాలను, బాధలను నివారించి వారికి స్వస్థతను చేకూర్చేందుకు తిరిగి వచ్చారని చెప్పారు. ఏసు పునరుద్ధానం ద్వారా ఆయన మహిమలు లోకానికి తెలియజేశారన్నారు. సెయింట్ పాల్ సెంటినరీ చర్చి (సీఎస్ఐ) ఆవరణలో ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వమానవాళి కోసమే ఏసుక్రీస్తు ఆగమనం జరిగిందని క్రైస్తవ బోధకులు పేర్కొన్నారు. బాబు రాజేంద్రప్రసాద్ రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ సెంటినరీ చర్చి ఆవరణలో నిర్వహించిన ప్రార్థనలో క్రైస్తవ ప్రముఖులు మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా సమాజంలోని చెడును రూపుమాపవచ్చని చెప్పారు.

మందిరంలో ఈస్టర్ ప్రార్థనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఏసు పునరుత్థాన దినమైన ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని ప్రశాంత ప్రార్థనా మందిరం(చర్చి)లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు విశ్రాంత బిషప్ డాక్టర్ గోవాడ దైవాశీర్వాదం ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ మరణాన్ని జయించి తిరిగి లేచిన జయ ఏసు వాస్తవ మహిమాన్వితమైన చారిత్రక సంఘటన గురించి, పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లోని వాక్యాల ద్వారా భక్తులకు వివరించారు. మరణ భయం నుంచి మానవుడిని నడిపించేందుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రమణి, సంఘ కాపరి టీ క్లియోని దేవకృప, సహ కాపరులు జోసఫ్, మోహన్‌రావు,, సభ్యులు అనురాధ, మేరి, కుమారి, ప్రశాంతి తదితరులు దేవుని స్తుతి గీతాలను ఆలపించారు.



అగాపే చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఆసిఫ్



ఆశీస్సులందుకుంటున్న షేక్ ఆసిఫ్



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనల్లో బైబిల్ సందేశం ఇస్తున్న గోవాడ దైవాశీర్వాదం

సామాజిక సేవలో విస్తృతమైన భాగస్వామ్యం

కంపెయిన్‌షిప్ ఇఫ్తార్‌లో బ్రదర్ సిరాజ్, షేక్ ఆసిఫ్



మాట్లాడుతున్న ఆసిఫ్, బ్రదర్ సిరాజ్



ఇఫ్తార్‌ను ప్రారంభిస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):భారతదేశంలో నాటి నుంచి సామాజిక సేవల్లో ముస్లిం సమాజం విస్తృతమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బ్రదర్ సిరాజ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కంపెయిన్‌షిప్ సంస్థ 'కంపెయిన్‌షిప్ దావత్ ఇఫ్తార్' పేరుతో ఆదివారం రాత్రి స్థానిక ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో ఇఫ్తార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు, ఇఫ్తార్ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. తొలుత జరిగిన సభలో బ్రదర్ సిరాజ్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలకు అవకాశమున్న ప్రతి ఒక్కరూ తోడుగా ఉండాలన్నారు. తోటి వ్యక్తికి సాయమందిస్తే భగవంతుడు ఆశీస్సులందిస్తాడని చెప్పారు. ముఖ్యంగా ఇతరుల గురించి చాడీలు చెప్పి వారి పతనానికి కారణమయ్యే వ్యక్తులను భగవంతుడు క్షమించడని గుర్తు చేశారు. ముస్లిం సమాజానికి చెందిన అనేక మంది ప్రముఖులు స్వాతంత్ర్యోద్యమం నుంచి భారతీయ సమగ్రతకు, సామాజిక వికాసానికి అనేక ఘట్టాల్లో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. ముస్లిం సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు అట్టడుగున ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముస్లింలకు అండగా ఉండి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రక్తదాన కార్యక్రమాన్ని కంపెయిన్‌షిప్ సంస్థ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికీ దేశంలో నిత్యం రక్తం అందకా సుమారు వందలాది మంది మరణిస్తున్నారని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. అంతే కాకుండా కంపెయిన్‌షిప్ దేశ వ్యాపితంగా ముస్లిం సమాజం ఉన్నతి కోసం పాటుపడుతుందని వివరించారు.

కంపెయిన్‌షిప్ సేవలు అభినందనీయం :

సమాజానికి కంపెయిన్‌షిప్ సంస్థ చక్కని సేవలందిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. కంపెయిన్‌షిప్ ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆసిఫ్ ముస్లింలనుద్దేశించి ప్రసంగించారు. ముస్లిం సమాజం చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏటా కంపెయిన్‌షిప్ సంస్థ విస్తృతమైన కార్యక్రమాలను నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తుందని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. తనకు అండగా ఉండాలని కోరారు. సంస్థ ప్రముఖులు ఎండీ ఇంతియాజ్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

జాగార పర్వదినాలను శాంతియుతంగా చేసుకుందాం



సమావేశంలో ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రంజాన్ పండుగలో అత్యంత కీలకమైన జాగారం పర్వదినాలను శాంతియుత వాతావరణంలో జరుపుకుందామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదు పెద్దలతో ఏసీపీ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి నుంచి జాగారం పర్వదినాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు మత పెద్దలు సమన్వయం పాటించాలని కోరారు. మసీదు పరిసరాలతో పాటు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్తపేట సీఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

పశ్చిమ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బృందాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పశ్చిమ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కరకట్ట సౌత్, స్వాతి థియేటర్ రోడ్డు, మసీద్ రోడ్డులో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటు విలువైనదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేసేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



స్వర్ణకమలాలు నాటకంలోని సన్నివేశం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. కూచిపూడి నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. గణపతి స్తుతితో ప్రారంభించి ఆనందనర్తనం, రామచంద్రుని ప్రార్థిస్తూ రాముడు రాఘవుడు, భామనే సత్యభామనే, సూర్యాష్టకం అంశాలను ప్రదర్శించారు. జాహ్నవీసుస్మ, నవ్యసువర్ణ, షేక్ బింబిత, భానుశ్రీ, తానియాసిరి, పుష్కర సౌమ్య, చైత్ర, శ్రీదేవి, మృదుల, మేఘన నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణకమలాలు సాంఘీక నాటికను ప్రదర్శించారు. అభ్యుదయ భావాలు కలిగిన ఓ రచయిత తన భావాలకు దగ్గరగా ఉండే పల్లెటూరి అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. ఆమెకు శిక్షణనిచ్చి ఒక రచయిత్రిగా తయారు చేస్తాడు. సహజంగా ప్రతిభ కలిగిన ఆ రచయిత్రి సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటుంది. అది సహించలేని ఆ రచయిత ఆమెను వేధింపులకు గురి చేస్తాడు. ఆమె అతడిలోని మానవత్వాన్ని మేలుకొలిపి సమాజంలో బాధ్యత కలిగిన రచయితగా నిలబెడుతుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవినేని కిషోర్‌కుమార్ దృశ్యవేదిక కార్యక్రమాలను అభినందించారు. సంస్థ సభ్యులు నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, రమేష్, బొర్రా నరేన్ కార్యక్రమాలను నిర్వహించారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ):ప్రజా వైద్యశాల, వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాధరపురం కబేళా సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో శ్రీనిధి శాంతినగర్ కాలనీ, బ్రహ్మయ్య కాలనీ, రామరాజ్య నగర్, రోటరీనగర్ వాసులు సుమారు 200 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ వి.శ్రవణ్ కుమార్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రూపికలు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, లివర్, కిడ్నీ, కొలెస్ట్రాల్ సంబంధిత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో వస్తున్న ఆహార అలవాట్ల కారణంగా అనేక శారీరక రుగ్మతలు వస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యం విషయంలో ఏ సమస్య వచ్చినా వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గ కిషోర్ మాట్లాడుతూ పేదల కోసం ప్రత్యేకించి ఏర్పాటు చేస్తున్న ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అవసరమైనవారికి మందులు ఉచితంగా అందచేశారు. ట్రస్ట్ సెక్రటరీ ముత్తంశెట్టి విజయలక్ష్మి, సేవా సభ్యులు భీమన రమేష్, వీరయ్య, లక్ష్మీ శ్రీనివాస్, శిరీష, మాధవి, దుర్గాప్రసాద్, వినయ్, సాయి, స్వప్న, వేముల కుమారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● హలీం... టైం



రంజాన్ మాసం నేపథ్యంలో విజయవాడలోని వించిపేట పరిసరాలు హలీం సెంటర్లతో రద్దీగా మారాయి. సాయంత్రం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు సందర్శకులతో హలీం కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. హలీం ప్రియుల రాకతో ఈ ప్రాంతమంతా సందడిగా మారుతుంది. పాతబస్తీలో పెద్ద సంఖ్యలో హలీం దుకాణాలు ఏర్పాటుచేశారు. హలీమ్, కబాబ్, ఫలుదా, వివిధ రకాల బిర్యానీలను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

డీసీపీ

పెనుగంచిప్రోలు:సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. ఆయన వెంట నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకీరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి.రాంబాబు తదితరులు ఉన్నారు.